రేపు హెల్మెట్ వాడకంపై 1కే వాక్

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జూలై 16: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించేందుకు ఈ నెల 18న 1కె వాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.సాయి కళ్యాణ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థల అధికారుల పరిధిలో న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ర్యాలీ వీటీ అగ్రహారం నుంచి జిల్లా న్యాయాధికార సంస్థ కార్యాలయం, పాత కోర్టు, వైజంక్షన్ వరకూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ర్యాలీ ఉదయం 9.30 గంటలకు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ (ఫైల్)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి గత సోమవారం ఓ తహసీల్దార్ అలస్యంగా హాజరయ్యారు. కలెక్టర్ కార్యాలయ అధికారులు ఆ మండలానికి చెందిన ప్రజా సమస్య గురించి అడిగేందుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదించారు. ఆ సమయంలో ఆయన అందుబాటులో లేరు. అంతే సాయంత్రానికి కలెక్టర్ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీస్ జారీ అయింది.

ఇదే విధంగా మరో తహసీల్దార్ కూడా నోటీస్ అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇస్తున్న ప్రాధాన్యమిది. ఈ విషయంలో జిల్లా స్థాయి అధికారులను కూడా మినహాయించడం లేదు.

అధికారులంతా రావాల్సిందే..!

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరుకానివారికి షోకాజ్ నోటీసులు
- జిల్లా స్థాయి అధికారులనూ వదలని కలెక్టర్
- ఎక్కడికక్కడే పరిష్కారం చూపాలని ఆదేశాలు

శృంగవరపుకోట, జూలై 16:

తొమ్మిది రోజుల కిందట జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకాని 26 మంది జిల్లా స్థాయి అధికారులు ఈ షోకాజ్ నోటీస్‌లు అందుకున్నట్లు సమాచారం. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అన్ని స్థాయిల్లో అధికారులు చొరవ చూపడం లేదు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పలువురి అధికారుల తీరుతో సమస్యలు పేరుకుపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక చేపడుతోంది. దీన్ని కూడా కొంత మంది అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించడం లేదు. తామెళ్లకుండా కింది స్థాయి అధికారులను పంపిస్తున్నారు. వారికేమో సమస్య అర్థంకాక జిల్లా ఉన్నతాధికారులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక నీళ్లనములుతున్నారు. జిల్లా కేంద్రంలోనూ ఈ పరిస్థితి ఉంది. ఇకపై ఈ విధంగా జరగకుండా ఉండేందుకు కలెక్టర్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. బాధ్యతాయుత అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తూచ తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, తహసీల్దార్, ఎంపిడివో కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులంతా ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కొన్నేళ్లుగా ఇదే తంతు సాగుతోంది. దీన్ని గత వైసీపీ ప్రభుత్వం స్పందన పేరుతో నిర్వహిస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పిలుస్తోంది. గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం దొరకని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జిల్లా స్థాయిలో వినతులను స్వీకరిస్తుంది. ఈ వినతులను మండల అధికారులకు పంపించడం ద్వారా పరిష్కారం చూపుతోంది.

- వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన స్పందనలో వినతులు స్వీకరించడం వరకే పని అన్నవిధంగా వ్యవహరించారు. మండల స్థాయిలో జరిగే స్పందనలో తహసీల్దార్‌లకు బదులు ఉపతహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లలో ఎవరో ఒకర్ని మెక్కుబడిగా పంపించేవారు. ఇదే విధంగా మండల పరిషత్ అధికారికి బదులు పరిపాలన అధికారి, పంచాయతీ విస్తరణ అధికారి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లలో ఎవరో ఒకరు హాజరయ్యేవారు. వ్యవసాయ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, సాగునీటి శాఖ వంటి మండల స్థాయి అధికారులు రాకుండా వీరి కిందపని చేసేవారే ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ల్లో కనిపించేవారు. కలెక్టరేట్‌లో జరిగే జిల్లా స్థాయి గ్రీవెన్స్‌లోనూ జిల్లా స్థాయి అధికారుల్లో చాలా వరకు ముఖాలు కనిపించేవి కావు. ఈ విధంగా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నీరుగార్చారు.



- ప్రభుత్వం మారినా అధికారుల తీరు ఇంకా మారలేదు. లోపాలను గ్రహించిన కలెక్టర్ దీన్ని సరిచేసే ప్రయత్నం చేస్తున్నారు. ఉదయం 9.30గంటలకే అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపడుతున్నారు. కార్యక్రమ ఆరంభం నుంచి చివరి వరకు ఏ శాఖకు చెందిన వినతి వస్తే ఆశాఖకు చెందిన ముఖ్య అధికారి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆశాఖకు చెందిన మండల స్థాయి ముఖ్య అధికారితో వినతిలో వున్న సమస్యపై చర్చిస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలోనే సమస్య పరిష్కారమవుతుందని, అక్కడ కాకుంటేనే జిల్లా కేంద్రానికి రావాలని ప్రజలను కోరుతున్నారు.





లబ్ధిదారులకు త్వరలో అందజేయనున్న టిడ్కో ఇళ్లు

గృహయోగం

- టిడ్కో ఇళ్ల సముదాయానికి గ్రహణం వీడే సమయం ఆసన్నం
- కొద్దిరోజుల్లో నిర్మాణం పూర్తి చేసి అప్పగింత
- ఎదురుచూస్తున్న 16 బ్లాకుల లబ్ధిదారులు

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరలోనే గృహయోగం కలగనుంది. ఐదేళ్ల నిర్లక్ష్యపు చెర నుంచి ఆ ఇళ్లు బయటపడ్డాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో మిగిలిన పనులు పూర్తయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. అధికారులు ఇళ్లను ఇటీవలే పరిశీలించారు. ఇంకా ఏఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయో గుర్తించారు. కొద్ది రోజుల్లోనే ఇళ్లు లబ్ధిదారులకు అందజేసే అవకాశం ఉంది. అదే ఆశతో బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని రామన్నదొరవలసలో 16 బ్లాకుల లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని రామన్నదొరవలస సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు సమీపంలో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయానికి గ్రహణం వీడే సమయం ఆసన్నమైంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఐదేళ్ల పాటు ఈ ఇళ్ల నిర్మాణ ప్రక్రియకు మోకాలు అడ్డిన సంగతి తెలిసిందే. వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఆ ఇళ్లకు పోటీగా అన్నట్లుగా జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణాలను ప్రారంభించారు. అటు టిడ్కో ఇళ్లను గాని, ఇటు జగనన్న ఇళ్ల కాలనీలనూ పూర్తి చేయలేక వైసీపీ చతికిలపడింది. దీంతో లబ్ధిదారులంతా నరకయాతనకు గురయ్యారు. 2018లో చంద్రబాబు హయాంలో 31.69 ఎకరాల్లో 2448 ఇళ్లను జీ ప్లస్ 5 ప్రాతిపదికన రూ.164.77 కోట్లతో రామన్నదొరవలసలో ప్రాజెక్టును ప్రారంభించారు. 2019 ఎన్నికల ముందు పండగ వాతావరణంలో లబ్ధిదారులతో టీడీపీ నేతలు సమావేశం నిర్వహించి లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించారు. ఆ తరువాత టీడీపీ ఓటమి చెందడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఆ తర్వాత కొన్నాళ్లకు లబ్ధిదారులతో సమావేశం జరిపి టిడ్కో ఇళ్లను అప్పగించేస్తాం... తీసుకోండి అంటూ వైసీపీ నాయకులు హడావిడి చేశారు. పూర్తి కాకుండా ఇళ్లల్లోకి దిగేది లేదని లబ్ధిదారులంతా వైసీపీ నాయకులకు తెగేసి చెప్పేశారు. అంతే. తర్వాత టిడ్కో ఇళ్లకు సంబంధించి ఎలాంటి పరిణామం జరగలేదు.

- మూడు కేటగిరీల్లో ఐదు అంతస్తుల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 300 ఎస్ఎఫ్‌టీ సైజులో 1344 ఇళ్లు, 365 ఎస్ఎఫ్‌టీ సైజులో 528 ఇళ్లు, 430 ఎస్ఎఫ్‌టీ సైజులో 576 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో బ్లాకులో 48 ఇళ్లు చొప్పున ఉంటాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో 25 శాతం లోపు నిర్మాణం కాని పనులను నిలిపేసి మిగిలిన ఇళ్ల పనులను నత్తనడక మాదిరి ఐదేళ్ల పాటు సాగదీశారు.

త్రిశంకుస్వర్గంలో 700 మంది లబ్ధిదారులు..

25 శాతం లోపు పనుల కేటగిరీలో రద్దయిపోయిన ఇళ్ల లబ్ధిదారులు 700 మందికి చెల్లించాల్సిన డిపాజిట్ సొమ్ము విషయంలో వైసీపీ ప్రభుత్వం చుక్కలు చూపించింది. ఒక్కొక్కరికీ రూ.25 వేలు, రూ.50 వేల నుంచి లక్షరూపాయలు చొప్పున డబ్బులు వాపసు చేయాల్సి ఉంది. ఆ సొమ్ము కోసం లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగిలా తిరిగి గగ్గోలు పెట్టినా ఫలితం లేకపోయింది. నాయకులకు, అధికారులకు ఎంతలా మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించలేదు.

- కొత్త ప్రభుత్వం మెసర్స్ వీఎస్‌సీ, ఏజేఎంసీపీఎల్, ఆర్‌కెఐపీఎల్ అండ్ సింగాన్ జేవీ, వెల్కో ఇన్‌ఫ్రాటెక్ సంస్థలకు టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు అప్పగించారు. పెండింగ్ నిర్మాణాలను పూర్తి చేసి రోడ్డు సౌకర్యం కల్పిస్తే టిడ్కో కాలనీ ఓ టౌన్‌షిప్‌గా విరాజిల్లడం ఖాయం.

రూ.26 కోట్లు అవసరం

టిడ్కో ఇళ్ల కాలనీ నూరు శాతం పూర్తవ్వాలంటే రూ.26 కోట్లు అవసరమని టిడ్కో అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆగిపోయిన ఇళ్లకు సంబంధించి ఇంకా ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. ఇటీవల పర్యటించి పరిశీలించిన స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనకు అన్ని అంశాలను వివరిస్తూ నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పూర్తయిన ఇళ్లన్నింటినీ త్వరలో లబ్ధిదారులకు అప్పగిస్తాం.

-లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి



గజపతినగరం సమీపంలో జోరుగా కురుస్తున్న వాన

వాన.. జోరు

విజయనగరం(ఆంధ్రజ్యోతి)

వాన కోసం ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్న అన్నదాతల మోముల్లో మంగళవారం కాస్త ఆనందం కనిపించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వానతో ఆకుమడులకు ప్రాణం లేచి వచ్చినట్లయింది. తాత్కాలికంగా రైతులకు ఉపశమనం కలగనుంది. వాస్తవానికి జిల్లాలో చాలా చోట్ల నీటి వనరులు వెలవెలబోతున్నాయి. గెడ్డలు, చెరువుల్లో నీరు పూర్తిగా ఎండిపోయింది. కొద్ది చెరువుల్లో మాత్రం 50 శాతం కంటే తక్కువగా వుంది. ఈ నేపథ్యంలో వానాకాలంలో రైతులు వర్షం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. అల్పపీడన ద్రోణి కారణంగా ఈ నెల 16 నుంచి 20 వరకూ వర్షాలు కురుస్తాయంటున్నారు.

భోగాపురంపై కన్ను

- పెరుగుతున్న ఆక్రమణలు
- ఎయిర్‌పోర్టు, బీచ్‌కారిడార్ రాకతో పెరిగిన భూముల ధరలు

భోగాపురం, జూలై 16: భోగాపురంలో భూఆక్రమణలు పెరుగుతున్నాయి. ఓవక్క అంతర్జాతీయ విమానాశ్రయం, మరోవైపు రాబోతున్న బీచ్‌కారిడర్, మెట్రో తదితర ప్రాజెక్టులను దృష్టిలో పెట్టుకుని కొందరు వ్యక్తులు భోగాపురం చుట్టుపక్కల ప్రాంతాలపై కన్నేశారు. ఏమాత్రం అవకాశం ఉన్నా వాలిపోదామని చూస్తున్నారు. ఇంకొందరు గెడ్డలు, వాగుల వద్ద భూములు కొని వాటి భూములను కలిపేసుకునే పనిలో పడ్డారు.

భోగాపురంలో ప్రస్తుతం జరుగుతున్న, భవిష్యత్‌లో జరగనున్న అభివృద్ధి పనులతో మండలం రూపురేఖలే మారనున్నాయి. ఎయిర్‌పోర్టు ఆధారంగా అనేక అనుబంధ పరిశ్రమలు రానున్నాయి. ఇదే సమయంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. భూములు కొనాలన్నా, అమ్మాలన్నా కోట్ల రూపాయలు పలుకుతున్నాయి. దీంతో కొందరు వ్యక్తులు ఆక్రమణలకు తెరలేపుతున్నారు. జిరాయతీ భూములు కొని సమీపంలో ఉన్న గెడ్డలు, వాగులు, చెరువులు ఆక్రమిస్తున్నారు. రోజుల వ్యవధిలో లేఅవుట్లుగా తయారు చేస్తున్నారు. ఈ పరిణామంతో వందల ఎకరాల్లో పంటలకు నీటి కష్టాలు దాపురించే పరిస్థితి నెలకొంది. పంటలకు నీరివ్వాల్సిన కాలువలు, వాగులు, చెరువులను ఆక్రమించి వాటి సహజత్వాన్ని మార్చేస్తున్నారు.

- భోగాపురం మండలం దల్లిపేట పంచాయతీ ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి రాళ్లపాలెం వెళ్లే రహదారిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రహరీ పక్కన 231 సర్వే నెంబరులో వాగు ఉంది. సమీపంలో కాస్త జిరాయితీ భూమి ఉంది. ఓ వ్యక్తి రహదారి పక్కన కొంత వరకు వాగును ఆక్రమించుకొని దానిని మట్టితో పూడ్చేసి చదును చేసి కాంక్రీట్ స్తంభాలు ఏర్పాటు చేసి కంచే కూడా వేసేశారు. వాగు కప్పేయడంతో సమీప చెరువులోకి నీరు వెళ్లకుండా పోయింది. చెరువులోకి నీరు చేరక పోవడంతో దాని ఆధారంగా ఉన్న పంటలకు నీరు ఉండడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి వాగు ద్వారా చెరువులోకి నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై వీఆర్వో వాసుదేవిని వివరణ కోరగా సర్వే నెంబరు 231లో వాగు ఆక్రమణ వాస్తవమేనని, ఇదివరకే తొలగించాలని హెచ్చరించామని, దీనిపై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



వాగు స్థలంలో కాంక్రీట్ స్తంభాలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో
మరింత మెరుగ్గా వైద్యం

- 6 కేవీ ఆక్సిజన్ ట్యాంకు ఏర్పాటు
- మహారాజ సర్వజన ఆసుపత్రిగా పేరు మార్పునకు ప్రతిపాదన
- జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు

కలెక్టరేట్, జూలై 16: 'ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. రోగులకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరుస్తాం. అదనపు సౌకర్యాలు కల్పిస్తాం' అని జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం ప్రకటించింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రాన్ని తిరిగి రోగులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. సోలార్ పవర్ యానిట్ సామర్థ్యాన్ని 150 నుంచి 300 కిలోవాట్లకు పెంచడానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించామన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు వార్డు సచివాలయాల నుంచి ఐదుగురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను డిప్యూటేషన్‌పై తక్షణమే పంపించాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో అదనంగా 6కేవీ ఆక్సిజన్ ట్యాంకును ఏర్పాటు చేసి మొత్తం 257 పడకలకూ పైపులైన్ వేయాలని నిర్ణయించారు. దాదాపు రూ.80 లక్షలతో సర్వజన ఆసుపత్రి భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జీజీహెచ్‌ను మహారాజా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా పేరు మార్చేందుకు, ఆసుపత్రి ఆవరణలో డాక్టరు పీవీజీ రాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సభ్యులు ప్రతిపాదించగా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఘోషా ఆసుపత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయడానికి ఎంపీ నిధులు నుంచి రూ 31 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పీవీజీ రాజు విగ్రహం ఏర్పాటుకు తన సొంత నిధులను వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. సమావేశంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, డీఆర్‌వో సుమబాల, జీజీహెచ్ సూపరింటెండెంట్ అప్పలనాయుడు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టరు ఎస్.భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్

దిక్సూచి

గుంటూరు-లాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ ఏయూ)- 'అగ్రిసెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని వ్యవసాయ విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన స్కోర్ ద్వారా నాలుగేళ్ల వ్యవధి గల 'బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్' ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్.జీ.రంగా వర్సిటీ అగ్రిసెట్



విభాగాలు: అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్

అర్హత: ఏఎన్‌జీఆర్‌ఏయూ/పీజేటీఎస్‌ఏయూ నుంచి రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 22 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

అగ్రిసెట్ వివరాలు: అభ్యర్థులు తమ డిప్లొమా స్ట్రీమ్‌లోనే అగ్రిసెట్ ఎగ్జామ్ రాయాలి. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోగ్రామ్‌లకు ఏఎన్‌జీఆర్‌ఏయూ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 25 శాతం(30)మార్కులు రావాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **ఏఎన్‌జీఆర్‌ఏయూ అగ్రిసెట్ తేదీ:** ఆగస్టు 27 ● **వెబ్‌సైట్:** angrau.ac.in

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the post-graduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000

Last Date to Apply: 04-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/HDFC54

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AT8a4gNలో చదవండి.

SCHOLARSHIP ALERT

Panasonic Ratti Chhatr Scholarship

Description: Panasonic Life Solutions India (PLSIND) invites applications from students enrolling in B.E./B.Tech. courses at the Indian Institutes of Technology (IITs).

Eligibility: Open for students across India who have cleared the entrance for admission into B.E./B.Tech. courses at any of the IITs (Indian Institute of Technology) in 2024-25. Applicants must have cleared their Class 12 examination or be awaiting final results. Applicants must have scored more than 75% marks in Class 12. The annual family income of the applicant must not be more than INR 8,00,000 from all sources. Only candidates from 2024-25 batch are eligible to apply.

Prizes & Rewards: Scholarship amount: INR 70,250 per year for four years

Last Date: 15-08-2024 *Application:* Online only

Short Url: www.b4s.in/aj/RCSP56

buddy4study.com

పోటీ పరీక్షల దిక్సూచి

కొత్త పుస్తకం

భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ

మరి కొద్ది నెలల్లో తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు నిర్వహించబోతున్నారు. అటు ఏపీలోనూ ఇటీవల కొలువు తీరిన కొత్త ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సమాయత్తం అవుతోంది. పోటీ పరీక్షలు ఏవైనా...ఇండియన్ పాలిటీ ప్రాధాన్యం ఎనలేనిది. పైగా అన్ని సబ్జెక్టుల్లో కన్నా ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టే సబ్జెక్టు కూడా ఇదే. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షల శిక్షణలో చాలా అనుభవం ఉన్న డాక్టర్ సుంకర రమాదేవీ రచించిన 'భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ' 15వ ఎడిషన్ మార్కెట్‌లోకి విడుదల అయ్యింది. దాదాపు 333 పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను అధ్యయనం చేసి ఈ పుస్తకానికి రూపకల్పన చేశారు. శాసన వ్యవస్థల కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థల్లో వచ్చిన అన్ని పరిణామాలను, చట్టాలను, కోర్టుల తీర్పులను ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాజ్యాంగ నిర్మాణ వివరాలతోపాటు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ చరిత్రలో ముఖ్య ఘట్టాలు, రాజ్యాంగం ఏర్పడటానికి దారితీసిన చారిత్రక పోరాటాలు - పరిణామాలు, బ్రిటిష్ పాలకులు అనుసరించిన వ్యూహాలు తదితర వివరాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి. భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సంపూర్ణంగా, వాద ప్రతివాదాల సమాచారంతో ఎంతో ప్రామాణికంగా రూపొందించారు. అదేవిధంగా ఇండియా వర్సెస్ భారత్, ఉమ్మడి పౌర స్మృతి- ఒకే దేశం ఒకే చట్టం, పౌరసత్వ సవరణ చట్టం- విమర్శ, ఆర్టికల్ 370 రద్దు- సుప్రీంకోర్టు తీర్పు, కొత్త పార్లమెంట్ భవనం- సెంగోల్ స్థాపన, జమిలీ ఎన్నికలు - రామ్‌నాథ్ కోవింద్ కమిటీ, కొత్త నేర న్యాయ చట్టాలు, సాధారణ ఎన్నికల ఫలితాలు- 2024పై విశ్లేషణ, ఎలక్టోరల్ బాండ్స్ వంటి సమకాలీన అంశాలను వివరంగా చర్చించారు. సమగ్రమైన రాజ్యాంగ విశ్లేషణను, భారత రాజకీయాలకు సంబంధించిన సమాచారాన్ని, చారిత్రక పరిణామాలను వివిధ పట్టికల రూపంలో చక్కగా అందించారు. ఈ పుస్తకం కేవలం ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకే కాదు విద్యార్థులకు, అధ్యాపకులకు, న్యాయవాదులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే వారికి కరదీపిక వలె ఉపయోగపడుతుంది.



పుస్తకం పేరు: భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ (15వ ఎడిషన్)
పేజీలు: 1202(రెండు వాల్యూమ్స్ కలిపి)
వెల: రూ.899/-
ప్రతులకు: శ్రీ తేజ పబ్లికేషన్స్, గాంధీనగర్, హైదరాబాద్-500080 **ఫోన్ నెం:** 8686430054, 8686430055

నవ్య | చిత్రజ్యోతి

బ్రహ్మారాక్షసుడిలా...



తమిళ కథానాయకుడు ధనుష్ 50వ చిత్రం 'రాయన్'. ఈ సినిమాకు ఆయనే దర్శకుడు కూడా. సందీప్‌కిషన్, కాళిదాస్ జయరామ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'బ్రహ్మారాక్షసుడిలా వస్తాడు.. దహనం చేస్తాడు' అంటూ ధనుష్ పాత్రను పరిచయం చేశారు. యాక్షన్ ప్యాక్డ్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ అదిరిపోయింది. ఇందులో నటించిన సందీప్‌కిషన్, ప్రకాశ్‌రాజ్, ఎస్.జె.సూర్య, కాళిదాస్ జయరామ్ ముఖ్య పాత్రలో కనిపించారు. ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్.రెహమాన్ నేపథ్యం సంగీతం అలరించింది. పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఈ నెల 26న 'రాయన్' చిత్రం విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను ఏషియన్ సురేశ్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విడుదల చేయనుంది.

ఆ రోజులు మళ్లీ రాకూడదు



'గడచిన మూడేళ్ల ఎన్నో ఆటుపోట్లు చవిచూశాను. నా జీవితం తీవ్రమైన ఒడిదుడుకులతో గడిచింది. ఆ రోజులు నా జీవితంలో మళ్లీ రాకూడదు అని కోరుకుంటున్నాను' అని హీరోయిన్ సమంత అన్నారు. ఆమె ఇటీవలే ఓ మీడియా ఇంటర్వ్యూలో తన సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. 'మన జీవితాల్లో కొన్ని సంఘటనలు చేదు అనుభవాలుగా మిగిలిపోతాయి. ఎంత ప్రయత్నించినా మనం వాటిని ఆపలేం. అలాంటప్పుడు వాటిని అంగీకరించి, అధిగమిస్తూ ముందుకెళ్లడమే మనం చేయాల్సింది. కష్టకాలంలో ఆధ్యాత్మికత నాకు స్ఫూర్తినిచ్చింది. వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా నాలో మంచి మార్పులకు కారణమైంది. ఈతరం ఎక్కువగా మానసిక అనారోగ్యానికి గురవుతోంది. ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవడం వల్ల ప్రశాంతంగా ఉండొచ్చు. ప్రస్తుతం నా జీవితం బావుంది. నేను మునుపటికన్నా బావున్నాను' అని సమంత చెప్పారు. కొత్త సినిమాల గురించి మాట్లాడుతూ 'ఈ ప్రపంచంలో నాకు బాగా ఇష్టమైన విషయం కెమెరా ముందు నిల్చోవడమే. ఆగస్టు నుంచి కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొంటాను. నా పాత్ర కోసం తర్ఫీదు అవుతున్నాను. విలువిద్య, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నాను. నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది. అందుకే కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉన్న కథలనే ఎంపిక చేసుకుంటున్నాను' అని ఆమె చెప్పారు. సమంత స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'లో నటిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ-బన్నీ' వెబ్ సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ అవనుంది.

ఇది సెలబ్రేట్ చేసుకోవాల్సిన విజయం




'నా సినీ జీవితంలో 200కు పైగా సినిమాలు చేశాను. అయితే వాటిలో అన్ని సినిమాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి ఉండకపోవచ్చు. కానీ 'కల్కి 2898 ఏడీ' విజయాన్ని మాత్రం కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలి. సినిమా విడుదలైనప్పటి నుంచి నాకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి' అని నటుడు కమల్‌హాసన్ అన్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకోవడంతో పాటు రూ. వెయ్యికోట్ల వసూళ్లను అధిగమించిన సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన కమల్‌హాసన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ "కల్కి చిత్రానికి వసూళ్ల పరంగా వస్తున్న ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో యాస్కిన్ పాత్ర కోసం చాలా కసరత్తు జరిగింది. చాలా కష్టపడ్డాం. మేకప్ కోసం లాస్ ఏంజెల్స్ వెళ్లాం. మొదట్లో నా గెటప్ చూసి నాకే ఎబ్బెట్టుగా అనిపించినా, క్రమంగా ఉత్సాహం కలిగింది. రెండో భాగంలో నా పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలోని దిగ్గజాలు అంతా ఈ చిత్రంలో కలిసి నటించారు. ఒకప్పుడు సింగీతం శ్రీనివాసరావులా ఇప్పుడు నాగ్ అశ్విన్ కూడా ప్రేక్షకులను మాయ చేశారు. చిన్నపిల్లలు ఆటలో లీనమైపోయినట్లు పాత్రధారులందరూ తమ తమ పాత్రల్లో జీవించారు. సినిమా చూసిన ప్రేక్షకులు ఎంత సంతోషిస్తే మేము అంతగా సంతోషిస్తాం' అని పేర్కొన్నారు.

విలన్‌గా అభిషేక్ బచ్చన్



బాలీవుడ్‌లో ఒక్కో హీరో ఇప్పుడు విలన్‌గా మారుతున్నాడు. సంజయ్‌దత్, సైఫ్ అలీఖాన్, రణ్‌వీర్ సింగ్, బాబీ డియోల్... ఇలా . తాజాగా ఈ జాబితాలోకి అభిషేక్ బచ్చన్ చేరబోతున్నారు. షారుఖ్‌ఖాన్ కొత్త చిత్రం 'కింగ్'లో అభిషేక్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన తండ్రి అమితాబ్ స్వయంగా వెల్లడించడం విశేషం. 'ఇదే సమయం' అంటూ తనయుడు అభిషేక్‌కు అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు అమితాబ్. గత ఏడాది 'జవాన్', 'పఠాన్' చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ ఇచ్చిన షారుఖ్ ఖాన్ ఇప్పుడు 'కింగ్' చిత్రం కోసం సిద్ధమవుతున్నారు. ఆయన కుమార్తె సుహానా ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'కింగ్' చిత్రానికి సుజయ్ ఘోష్ దర్శకత్వం వహిస్తున్నారు.

మాస్‌ను ఆకట్టుకునేలా...



రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్ అందరికీ నచ్చడమే కాకుండా.. సినిమాపై అంచనాలను పెంచింది. మంగళవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'మార్ ముంతా చోడ్ చింత'ను మేకర్స్ విడుదల చేశారు. మాస్‌ను ఆకట్టుకునేలా ఈ సాంగ్‌లోని లిరిక్స్, డాన్స్ మూమెంట్స్ సాగాయి. ఈ పాటకు శ్యామ్ సాహిత్యం అందించగా రాహుల్ సిప్లిగంజ్, ధనుంజయ్ సీపాన, కీర్తన శర్మ ఆలపించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి

ముద్దు సీన్‌కు మూడు కట్స్



'యానిమల్' సినిమాలో బోల్డ్ సీన్స్‌లో పాల్గొని అందరి దృష్టినీ ఆకర్షించిన హాట్ గర్ల్ త్రిప్తి దిమ్రీ నటించిన తాజా చిత్రం 'బ్యాడ్ న్యూజ్'. విక్కీ కౌశల్ హీరోగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ నెల 19న విడుదల కానుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోహీరోయిన్ల మధ్య ముద్దు సీన్లు మూడు ఉన్నాయట. ఈ మధ్యకాలంలో కిస్సింగ్ సీన్లను చూసీ చూడనట్లు వదిలేస్తున్న సెన్సార్ వారు 'బ్యాడ్ న్యూజ్' చిత్రం మీద కన్నెర్ర చేసి, కత్తెరకు పని చెప్పారట. విక్కీ, త్రిప్తి పై చిత్రీకరించిన ముద్దు సీన్లు మోతాదు మించి ఉన్నాయనీ, తగ్గించాలని సెన్సారు అధికారి చెప్పడంతో చేసేదేమీ లేక వాటిని తగ్గించి విడుదల చేస్తున్నారు. త్రిప్తి అభిమానులకు ఇది బ్యాడ్ న్యూసే కదూ!

పవర్‌ఫుల్ పాత్రలో



పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి కథానాయకుడిగా రూపొందుతున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'సర్దార్ 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'సర్దార్' చిత్రానికి ఇది కొనసాగింపు. కొన్ని రోజుల క్రితమే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమైంది. తాజాగా చిత్రబృందం అప్‌డేట్ ఇచ్చింది. నటుడు, దర్శకుడు ఎస్‌జే సూర్య ఈ చిత్రంలో పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తున్నట్లు మంగళవారం తెలిపింది. ఎస్. లక్ష్మణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తున్నారు.

ఆ రోజులు గుర్తొస్తున్నాయి



'ప్రతి సినిమాను ఎంతో ప్యాషన్‌తో తీసే నిర్మాత వేణుగోపాల్. ఆయనకు మంచి టేస్ట్ ఉంది. లవ్ స్టోరీస్ మీద పట్టుంది. ఈ సినిమా టీమ్‌ను, హీరోలను చూస్తుంటే నాకు 'ఈ నగరానికి ఏమైంది' రోజులు గుర్తుకు వస్తున్నాయి' అన్నారు హీరో విష్వక్‌సేన్. 'రోటీ కపడా రొమాన్స్' చిత్రంలోని 'గలీజ్' సాంగ్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సృజన్ కుమార్ బొజ్జం తో కలసి బెక్కం వేణుగోపాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్ హీరోలుగా నటించిన ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఓ కొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు చెప్పాలని ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ని నిర్మించాం. ఇటీవల కొంతమంది యూత్‌కి ఈ సినిమా చూపించాం. వారు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తో మా కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది' అన్నారు. ఆగస్టు 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మరో నిర్మాత సృజన్‌కుమార్ చెప్పారు.

ఆకట్టుకునే విజువల్స్‌తో... 'మా ఊరి జాతరలో'



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో' పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ఫోక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. సింధూరి విశాల్, హరిగౌర ఆలపించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్ : చోటా కె ప్రసాద్, డీఓపీ : ఎం. రిచర్డ్ నాథన్.

రాజ్ తరుణ్‌కు నోటీసులు ?



సినిమా హీరో రాజ్ తరుణ్‌పై లావణ్య చేసిన ఫిర్యాదులో రాజ్ తరుణ్‌ను విచారించేందుకు నార్సింగ్ పోలీసులు సిద్ధమయ్యారు. రేపు విచారణకు హాజరు కావాలని రాజ్‌తరుణ్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడంతో పాటు పలు అంశాలపై ఆరా తీయనున్నారు. రాజ్ తరుణ్‌కు నోటీసులు ఇచ్చినట్లు మంగళవారం ప్రచారం జరిగింది. అయితే ఈ కేసులో నోటీసుల విషయంపై నార్సింగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోసం సంప్రదించగా ఆయన స్పందించలేదు.

- నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ముగ్గురు స్నేహితుల కథ



మక్కా శ్రీను, సుచిత్ర రాథోడ్, దిల్ రమేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఎస్.ఐ.కోదండపాణి'. రెంటాల నాగేంద్ర దర్శకత్వంలో మక్కా శ్రీదేవి నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ప్రీమియర్ షోను మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రెంటాల నాగేంద్ర మాట్లాడుతూ "కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాను తెరకెక్కించాను. ముగ్గురు స్నేహితులు ఓ మర్డర్ మిస్టరీలో ఇరుక్కుని ఎలా బయటపడ్డారనేది సినిమా కథ" అని అన్నారు. "కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది. అందరినీ తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని నిర్మాత శ్రీదేవి అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఉదయ్, కెమెరామెన్: సబరి, సంగీతం: సాల్మన్.

సమాజానికి అవసరమైన ఇండియా ఫైల్స్



తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియా ఫైల్స్', ఇంద్రజ, సుమన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డాక్టర్ బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రంలో నటిస్తున్న ప్రతీ ఒక్కరికీ నా అభినందనలు. ఈ మూవీ టీమ్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. ప్రస్తుత సమాజానికి ఇలాంటి చిత్రం అవసరం" అని చెప్పారు. "ఈ సినిమా విడుదల తర్వాత ఇలాంటి తరహా కథలు మరిన్ని తెరకెక్కుతాయి. మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ చెప్పారు. "ప్రపంచంలో ప్రతీ మూలకు వెళ్లగలిగేది సినిమా మాత్రమే" అని దర్శకుడు బొమ్మకు మురళీ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్, డీఓపీ: జి.ఎల్.బాబు, సంగీతం:ఎమ్.ఎమ్.కీరవాణి.

మంచి కంటెంట్‌తో రేవు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి డాక్టర్ మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను డైరెక్టర్ బాబీ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా విజువల్స్ బాగున్నాయి. మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అని అన్నారు. "ఇదొక విభిన్న తరహా సినిమా. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది" అని దర్శకుడు హరినాథ్ పులి చెప్పారు. ఈ సినిమాకు ఎడిటర్: శివ శర్వాని, డీఓపీ: రేవంత్ సాగర్, నిర్మాణ పర్యవేక్షణ: సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పర్వతనేని రాంబాబు.

రేపు మండల సమావేశం

శృంగవరపుకోట: స్థానిక మండల సర్వసభ్య సమావేశం గురువారం జరగనున్నట్లు ఎంపీడీవో సాంబమూర్తి తెలిపారు. ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

పైడిమాంబ సేవలో ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్: నగరంలోని బొగ్గులదిబ్బలో పైడిమాంబ జాతర జరుగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పైడిమాంబను దర్శించుకున్నారు. స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

ఆసుపత్రి భవనాలు పూర్తి చేయించండి

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి భవనాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను కోరినట్లు స్థానిక బీజేపీ నాయకుడు డి.సూర్యారావు చెప్పారు. సోమవారం విశాఖపట్టణం వచ్చిన మంత్రికి వినతిపత్రం అందించామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దాశరథి, బంగారునాయుడు, రూపేష్ తదితరులు ఉన్నారు.

పాతరేగలో పారిశుధ్య పనులు

రామభద్రపురం: మండల పరిధిలోని పాతరేగ గ్రామపంచాయతీలో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని సర్పంచ్ ప్రతినిధి పైడిపునాయుడు తెలిపారు.

విద్యాదీవెన కిట్లు పంపిణీ పూర్తి

రాజాం రూరల్: రాజాం మండలంలో విద్యాదీవెన కిట్లు పంపిణీ కార్యక్రమం దాదాపుగా పూర్తయిందని ఎంఈవో-2 దుర్గారావు వెల్లడించారు. పాఠశాలల్లో ఉపాధ్యా యులు 5,513 మంది విద్యార్థులకు కిట్లు అందజేస్తారని ఎంఈవో దుర్గారావు వివరించారు.

సంకిలిలో అభివృద్ధి పనులు

రేగిడి: సంకిలి పంచాయితీలో ఒకవైపు పారిశుధ్య చర్యలు, మరోవైపు సీసీరోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ పట్టాభి, పంచాయితీ కార్యదర్శి శైలజ పర్యవేక్షిస్తున్నారు.

నేడు 12 గంటల నిర్విరామ భజన

విజయనగరం రూరల్: శయన ఏకాదశిని పురస్కరించుకుని కొత్తపేట కోదండ రామాలయంలో బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్విరామ హరినామస్మరణ(భజన) కార్యక్రమాన్ని నిర్వ హించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం వినాయక స్వామి, కోదండరా ముడు, కృష్ణునికి పూజలు నిర్వహించిన అనంతరం కళాకారులు భజన చేయనున్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

కలెక్టరేట్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 21 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎల్లమ్మతల్లి వారాల పండగ

బాడంగి: మండలంలోని ఎరుకులపాకలు గ్రామంలో ఎల్లమ్మతల్లి వారాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని 120 కుటుంబాలు అమ్మతల్లులు, పూజారులతో ఆనందోత్సాహాల మధ్య పండుగను నిర్వహించారు. గజరాయనివలస ఎంపీటీసీ గౌరి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై సదస్సు

కొత్తవలస: జిల్లాలోని దేవదాయ శాఖ భూములను సాగు చేసుకుంటున్న రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న ఉదయం 10 గంటలకు విజయనగరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సదస్సును ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ప్రతినిధులు గాడి అప్పారావు, రమణ తెలిపారు. మంగళవారం తుమ్మికాపల్లి గ్రామంలో దీనికి సంబంధించిన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

'కుష్ఠువ్యాధిపై సర్వే విజయవంతం చేయాలి'

కొత్తవలస: కుష్టువ్యాధిపై సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల వైద్యాధికారులు గోపాల కృష్ణ, సీతల్‌వర్మ తెలిపారు. మంగళవారం ఈ రెండు పీహెచ్‌సీలలో కుష్టువ్యాధి నిర్ధారణపై సర్వేపై అవగాహన కల్పించారు.

బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

శృంగవరపుకోట రూరల్: తాటిపూడి ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ఎంపీపీ సోమేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌తో విద్యార్థుల ప్రగతిపై చర్చించారు.

సింహాచలానికి పాదయాత్ర

కొత్తవలస: పూరీ జగన్నాథ స్వామి రథయాత్రను పురస్కరించుకుని గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మంగళపాలెం నుంచి సింహాచలం వరకు మంగళవారం పాదయాత్రను నిర్వహించారు. గిరిపుత్రులు, తాడికొండ వెంగమాంబ భజన బృందం ఈ పాదయాత్రలో పాల్గొన్నారు.

రైతులకు తప్పని కష్టాలు

లక్కవరపుకోట, జూలై 16: జిల్లాలో అక్కడక్కడా అడపాదడపా వర్షాలు పడుతున్నా మండలంలోని రైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. వర్షాలు కురవకపోవడంతో వరి నారు మొలకెత్తలేదు. నారును బతికించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. చెరువుల్లో చుక్క నీరు లేదు.. అక్కడక్కడా ఉన్న నేల బావుల్లోని నీటిని వాటర్ ఇంజన్ల ద్వారా తోడుకెళ్లి నారుమడులు తడుపుతున్నారు. మండలంలో సుమారు 3,800 హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉంది. ఆదిలోనే వర్షాలు మొహం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖర్చులు చూస్తే తడిసి మోపెడవుతున్నాయని వాపోతున్నారు.

బొబ్బిలి ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి

● ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

బొబ్బిలి, జూలై 16: బొబ్బిలి ప్రాంత సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హామీ ఇచ్చారు. ఎంపీ అయిన తరువాత తొలిసారి బొబ్బిలి కోటకు మంగళవారం వచ్చిన కలిశెట్టికి ఎమ్మెల్యే బేబీనాయనతో పాటు టీడీపీ నేతలు, కార్యకర్తలు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ రైల్వే హమాలీల విషయంతో పాటు స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. బొబ్బిలి పట్టణానికి తాగునీటి అవసరాలను తీర్చేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం సువర్ణముఖి నది నుంచి సుమారు రూ.వంద కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తి చేసేందుకు చిత్తశుద్ధిని ప్రదర్శించకపోవడంతో పట్టణానికి తాగునీటి కష్టాలు తీరడం లేదన్నారు. దీనిపై కేంద్ర అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. బాడంగి మండలం డొంకినవలస రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. హమాలీల సంఘం నేత దంతులూరి వర్మ ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం సమర్పించారు. వీరబొబ్బిలి మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు రేవెళ్ల కిరణ్ కుమార్, కార్యదర్శులు గోవిందనాయుడు, వీఎస్ శర్మలు తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న రైల్వే హమాలీలు

రామభద్రపురం మండలంలో పసికందుపై జరిగిన దురాగతం లాంటివి ఇంకెన్నడూ జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని విలేకరులకు తెలిపారు. ఎంపీ అప్పలనాయుడును కలుసుకున్న వారిలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, నేతలు రౌతు రామ్మూర్తి, గెంబలి శ్రీనివాసరావు, కాకల వెంకటరావు, కింతలి శ్రీదేవి, వెలగాడ హైమావతి, కళ్యంపూడి సత్యనారాయణ, రాయపురెడ్డి భాను తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నిటినీ నెరవేరుస్తాం



కొత్తవలస: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం చీపురువలస గ్రామంలో టీడీపీ నాయకులు అనిమిరెడ్డి రమణ, బంగారు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పులు పాలు చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

← చీపురువలస గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

సెంటర్ లైటింగ్ పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మెయిన్‌రోడ్‌లో కొత్త బల్బులు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాజాం రూరల్, జులై 16: రాజాంలో సెంటర్ లైటింగ్ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. 'ఇంకెన్నాళ్లో' శీర్షికన ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్తవి అమర్చే పనులు ప్రారంభింపజేశారు. సప్తగిరి కాలనీ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకూ 110 బల్బులకు గాను 73 వెలగని విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెల్లడించిన నేపథ్యంలో వెలగని బల్బులన్నీ అమరుస్తారా లేదా కొన్ని మాత్రమే అమర్చి చేతులు దులుపుకుంటారో చూడాలి.

అంతర్గత అప్పులు ఇప్పించండి

శృంగవరపుకోట, జూలై 16: అవసరం మేరకు ప్రతి సంఘానికి అంతర్గత అప్పు ఇప్పించాలని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి బ్యాంకర్లను కోరారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులకు వచ్చే మహిళలను గౌరవించాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి

ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలి

రేగిడి, జూలై 16: నాగావళీ నదీ తీర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాను నిఘా విభాగాలు నియంత్రించాలని ఆర్డీవో బి.శాంతి సిబ్బందిని ఆదేశించారు. వెంకటాపురం తదితర ఇసుక రేవుల్లో అక్రమ రవాణా ఆమె దృష్టికి వెళ్లింది. దీంతో మంగళవారం తహసీల్దార్ రాములమ్మతో కలసి పరిశీలించారు. రాత్రి వేళల్లో సిబ్బంది కాపలా ఉండేలా చూడాలని తహసీల్దార్, ఎస్ఐ శ్రీనివాస్‌లకు సూచించారు.



వెంకటాపురం ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న చీపురపల్లి ఆర్డీవో

భీమసింగి చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరవాలి

విజయనగరం దాసన్నపేట, జూలై 16: భీమసింగి చక్కర కర్మాగారంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని.. కర్మాగారం తెరిచే వరకూ పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. మంగళవారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీనివాసరావు విదేశాల నుంచి చక్కెర తక్కువ ధరలకు రావడం కర్మాగారం నష్టాలకు ప్రధాన కారణమని చెప్పడం సరికాదన్నారు. వేలాది మంది కార్మికులు, 6 వేల మంది రైతులు, ఈ కర్మాగారంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. పరిశ్రమ తెరిపించేంత వరకూ సీపీఎం పోరాడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం ప్రతినిధులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మీ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సూర్యనారాయణ

అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళాలు

విజయనగరం రూరల్: విజయనగరంలోని ఘోషాస్పత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌కు నగరానికి చెందిన ఎస్.వెంకటేశ్వర ప్రసాద్ రూ.లక్ష కందుల సాయిబాబా, హైమావతి దంపతులు రూ.30 వేలను విరాళంగా ఇచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ద్వారా కలెక్టర్ అంబేద్కర్‌కు ఈ మొత్తాన్ని అందజేశారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు.



విరాళం అందజేస్తున్న దాతలు

పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, జూలై 16: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ఎక్కువ మంది భక్తులు పైడిమాంబను దర్శించుకున్నారు. అమ్మవారిని వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. పైడిమాంబ ఆలయం పక్కన చండీయాగాన్ని నిర్వహించారు. ఈ యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం చదురుగుడి ముందు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



వివిధ రకాల పువ్వులతో పైడిమాంబకు అలంకరణ

ప్రతి పిల్లవానిపై పర్యవేక్షణ ఉండాలి

కలెక్టరేట్, జూలై 16: పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బాలల పట్ల మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధంపై జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై జిల్లా అధికారులతో మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మత్తు పదార్థాల నిరోధానికి శాఖలు వారి 100 రోజులు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసి అమలు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ ప్రధానంగా పాఠశాలల్లో డ్రాప్ అవుట్ల వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని బడికి రాని పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డీఆర్‌వో సుమబాల, బాల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ హిమబిందు, ఐసీడీఎస్ పీడీ శాంతి కుమారి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీ కల్యాణ చక్రవర్తి, సుధాకర రావు, జిల్లా వైద్యాధికారి భాస్కరరావు, డీఈవో ప్రేమకుమార్, డీపీవో శ్రీధర్ రాజా తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కేసలి అప్పారావు

కురిసింది.. వాన..

● రాకపోకలకు ఇబ్బందులు ● అన్నదాతలో ఆనందం



రాజాం-డోలపేట మార్గంలో వర్షపు నీరు ఇలా

రాజాం రూరల్, జులై 16: రాజాంలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏకధాటిగా కురిసిన వర్షం అన్నదాతల్లో ఆనందాన్ని నింపింది. ఇప్పటికే అనేక గ్రామాలలో ఎండిపోతున్న వరినారుకు వర్షం ప్రాణం పోసినట్లయింది. మొక్కజొన్న రైతుల్లో సైతం ఆనందం కనిపిస్తోంది. చెరకు సాగుకు కూడా ఈ వర్షం ఎంతో ప్రయోజనకారి కానుందని రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయం కావడంతో విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. పట్టణంలోని గొల్లవీధి, చాకలివీధి, మెంటిపేట ఎస్సీ కాలనీ, మాదిగ వీధి, మల్లికార్జున కాలనీ, ఈశ్వర నారాయణ కాలనీ, బాబానగర్ ప్రాంతాలలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరంతా రోడ్డుపైనే నిలిచిపోయింది. ఎల్‌బీసీ వెనుక భాగంలో సైతం నీరంతా రోడ్డుపైనే నిలిచిపోయింది. ఇదిలా ఉంటే జిల్లాలోని గజపతినగరం దత్తి రాజేరు, తెర్లాం, మెంటాడ తదితర మండలాలలో సైతం మంగళవారం వర్షం కురిసింది.

శృంగవరపుకోట రూరల్: మండలంలోని వివిధ ప్రాంతాల్లో మంగళ వారం మధ్యాహ్నం వర్షం కురవడంతో రైతులు ఆనందంతో పొంగిపోయారు. ఈ వర్షం ఖరీఫ్‌కు ఎంతో మేలు చేస్తుందన్నారు.



ఎస్‌కోట రూరల్: బొడ్డవరలో వర్షం కురుస్తున్న దృశ్యం →

రెండు ఆటోలు ఢీ.. వృద్ధురాలి మృతి

● ఒకరి పరిస్థితి విషమం.. నలుగురికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో ఆటోలు

మెంటాడ: మండలంలోని రాబంద -మీసాలపేట గ్రామాల మధ్య మంగళ వారం సాయంత్రం రెండు ఆటోలు ఢీకొని ఒక వృద్ధురాలు మృతిచెందగా, ఆటో డ్రైవర్ సహా మరో తొమ్మిదిమంది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం గదబవలస గ్రామానికి చెందిన కెల్ల సామమ్మ(70) మరో నలుగురు మహిళలతో కలిసి ఆటోలో బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన పుట్టినరోజు వేడుకలకు హాజరై తిరిగి వస్తుండగా, బాడంగి మండలం పింద్రంగి గ్రామానికి చెందిన ఐదుగురు మహిళలు మెంటాడ మండలం ఆండ్ర వద్ద ఆటో ఎక్కారు. మొత్తం పదిమందితో వెళ్తున్న ఆటో, రాబంధ మీసాలపేట గ్రామాల మధ్య దాసరి పేట సమీపంలో ఎదురుగా వస్తున్న వేరే ఆటోను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలోని కెల్ల సాయమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారిలో గదబవలసకు చెందిన కోరాడ రాములమ్మ, అట్టాడ అప్పలకొండ, తాడి వరలక్ష్మి, పి.వరలక్ష్మి తీవ్రంగా గాయపడడంతో వారిని విజయనగరం కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో అట్టాడ అప్పలకొండ పరిస్థితి విషమంగా ఉంది. స్వల్పంగా గాయపడిన ఆ ఆటో డ్రైవర్ జె.లక్ష్మణరావు, బాడంగి మండలం పింద్రంగివలస గ్రామానికి చెందిన చిన్నమ్మ, రాజేశ్వరి, సంతోషమ్మ, సింహాచలం, బంగారమ్మలను గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం కేంద్రాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆండ్ర ఎస్ఐ దేవి తెలిపారు. సామమ్మకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కాగా భర్త చనిపోయారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు



నిందితులతో సీఐ వెంకటరావు

విజయనగరం క్రైం, జూలై 16: నగరంలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఇటీవల నమోదైన కిడ్నాప్ కేసులో పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ వెంకటరావు తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఇటీవల నగరంలో వ్యాపారం చేసుకుంటున్న రాజస్థాన్‌కి చెందిన భగవాన్‌రామ్ అనే వ్యక్తిని రాజస్థాన్‌కి చెందిన కొంత మంది వ్యక్తులు కిడ్నాప్ చేసి దాడి చేసి గాయ పరిచి, మార్గమధ్యంలో విడిచిపెట్టి వెళ్లిపోయారు. దీనిపై భగవాన్‌రామ్ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నిందితుల్లో ఒకరైనవజోరాం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితులను అరెస్టు చేసేందుకు ఎస్పీ దీపిక ఆదేశాలతో బృందాలుగా ఏర్పడి, గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో నిందితులైన విజలురామ్, దీపేష్‌కుమార్, రమేష్, లీలారామ్, గణేష్ అనే ఈ ఐదుగురు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం లొంగిపోయారని తెలిపారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ తెలిపారు. సమావేశంలో క్రైం ఎస్ఐ తారకేశ్వరరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నెల్లిమర్ల, జూలై 16: నెల్లిమర్ల మండలం రామతీర్థం బోడికొండ సమీపంలో సీతారామునిపేట పొలాల్లో ఓ మహిళ పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉండడాన్ని స్థానికులు మంగళవారం గుర్తించి నెల్లిమర్ల పోలీసులకు తెలిపారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనం ద్వారా ఆమెను విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొండపల్లి మండలం కిండాం అగ్రహారానికి చెందిన మన్యాల రామయ్యమ్మ.. భర్త రాముతో కలిసి విశాఖలోని మధురవాడ ప్రాంతంలోని అపార్ట్‌మెంటులో వాచ్‌మెన్‌గా చేరి అక్కడే జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే నాలుగేళ్ల క్రితం రామతీర్థంలో శివరాత్రి జాతరకు వీరి చిన్నకుమారుడు స్నేహితుడితో కలిసి వచ్చి బోడికొండపై నుంచి జారి పడి మృతి చెందాడు. అప్పటినుంచి రామయ్యమ్మ తీవ్ర మనస్తాపంతో కాలం వెళ్లదీస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 15న సోమవారం విశాఖనుంచి స్వగ్రామం అగ్రహారం గ్రామానికి వచ్చి మంగళవారం ఉదయం విశాఖ వెళ్తానని తిరుగు ప్రయాణమైంది. అయితే ఆమె సకాలంలో విశాఖకు చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు వెతకడం ప్రారంభించారు. ఈ సమయంలో రామతీర్థం సమీపంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉందన్న సమాచారం అందడంతో విజయనగరం ఆసుపత్రికి చేరుకున్నట్టు భర్త రాము ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కుమారుడు మరణించిన చోటే తాను కూడా మరణించాలనే భావనతోనే తన భార్య రామతీర్థం చేరుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భర్త రాము పోలీసులకు తెలిపారు. నెల్లిమర్ల ఎస్ఐ డి.రామగణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

బాడంగి, జూలై 16: ఇటీవల కాలంలో మోటారు సైకిళ్లు, బంగారం చోరీలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొద్దినెలల నుంచి ముగడ, కామన్నవలస, ఆకులకట్ట, పెదపల్లి గ్రామాల్లో బంగారం చోరీ జరగ్గా దానికి సంబంధించిన మరిపి గోవిందరావు, ఆరిక నరేష్ అనే ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. వారి వద్ద నుంచి 90 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే వీరిరువురు ఇప్పటివరకు 4 బైకులు, ఒక బులెట్ బైకును దొంగిలించగా వాటిని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. గోవిందరావుది మన్యం జిల్లా పిన్నింటి రామినాయుడువలస కాగా, నరేష్‌ది మన్యం జిల్లా కొమరాడ మండలం పూడేశువలస అని తెలిపారు. ఇద్దరు నిందితులు గతంలో జైలులో పరిచయమై అనంతరం విడుదలై వచ్చి ఈ చోరీలకు పాల్పడినట్టు ఎస్ఐ తెలిపారు. ఏఎస్ఐ కొండలరావు, హెచ్‌సీ ఉమామహేశ్వరరావు, సిబ్బంది సహకారంతో వీరిని పట్టుకున్నట్టు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

బొబ్బిలి, జూలై 16: మండలంలోని పక్కి గ్రామానికి చెందిన కేతిరెడ్డి శంకరరావును బొబ్బిలి పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు గాయపరచడంతో వారిపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గౌడు భాస్కరరావు తెలిపారు. భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శంకరరావు సోమవారం రాత్రి 10 గంటల సమయంలో రైల్వేసెంటరులో టిఫిన్ పార్శిల్ తీసుకుని వెళ్తుండగా పట్టణానికి చెందిన సంతోష్, సాగర్, నాని అనే ముగ్గురు యువకులు అటకాయించి, దుర్భాషలాడి, కొట్టి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడ్డ శంకరరావును మంగళవారం రాత్రి స్థానిక సీహెచ్‌సీలో చికిత్స నిమిత్తం చేర్పించారు. గాయాలు తీవ్రంగా ఉండడంతో బుధవారం విజయనగరం ఆసుపత్రికి తరలించనున్నట్లు వైద్యాధికారి శశిభూషణరావు తెలిపారు. సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బొబ్బిలి: మండలంలోని పెంట వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా ఎస్ఈబీ అధికారులు మూడు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఇసుకను వేగావతి నది నుంచి అక్రమంగా తరలిస్తుండగా స్థానిక మహారాణిపేట, రంగరాయపురం గ్రామాలకు చెందిన డ్రైవర్లు రామకృష్ణ, నాగభూషణం, సాయికుమార్‌ను ఎస్ఈబీ అధికారులు అడ్డుకుని తమకు అప్పగించగా వారిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచామని ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. ఈ ముగ్గురికి ఒక్కొక్కరికి మూడువేల రూపాయల చొప్పున జడ్జి జరిమానా విధించినట్లు భాస్కరరావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శం కావాలి



హెచ్‌ఎంను సత్కరిస్తున్న దృశ్యం

జామి: కుమరాం ఉన్నత పాఠశాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శం కావాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఇటీవల ఈ పాఠశాల నుంచి 17మంది ట్రిపుల్ ఐటీకి, 10మంది ఉపకార వేతనాల పరీక్షలో ఎంపిక కావడం అభినందనీ యమన్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం పద్మావతిని సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న, పౌరవేదిక కార్యదర్శి జలంత్రి రామ చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా మొక్కలు నాటాలి

రేగిడి: ప్రతి విద్యార్థి పాఠశాల, ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి కాలుష్య నియంత్రణకు నడుం బిగించాలని ఎంఈఓ వరప్రసాదరావు సూచించారు. కొండవలస ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో మంగళవారం అమ్మ పేరుతో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

సీఎం నిర్ణయంపై సర్వత్రా హర్షం

రాజాం: జీపీఎస్‌పై జీఓ నెంబరు 54 రద్దు చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించడం పట్ల ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రావు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 12న జీపీఎస్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తామంతా తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్‌లను అర్థం చేసుకొని, గెజిట్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. జీవో నెంబరు 54ను శాశ్వతంగా రద్దు చేయాలని కోరారు. ● **బొబ్బిలి:** ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి నిరూపించుకున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు గత ఐదేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోకుండా జగన్ జీపీఎస్ పేరుతో కుచ్చుటోపీ పెట్టారని ఆప్టా రాష్ట్ర నాయకుడు ఏజీఎస్ గణపతిరావు, ఏపీటీఎఫ్ నేతలు జేసీ రాజు, బంకురు జోగి నాయుడు తదితరులు అన్నారు. మంగళ వారం సాయంత్రం వారు మాట్లాడుతూ జీపీఎస్‌పై ఇటీవల విడుదలైన గజిట్ నోటిఫికేషన్ విష యంలో సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించడం ఆనందంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ప్రవీణ్ కుమార్, సింహా చలం, రామకృష్ణ, ఎల్లయ్య లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు. ● **కలెక్టరేట్:** గత ప్రభుత్వం తీసుకుని వచ్చిన జిపిఎస్ గజిట్‌ను సీఎం చంద్రబాబు నాయుడు రద్దు చేయడంతో సీపీఎస్ ఉద్యోగులు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద సీఎం చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సింగరపు ఎల్లయ్య మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో సిపిఎస్ ఉద్యోగులను అడుగడుగునా మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి వెళ్తూ జిపిఎస్ అనే దుర్మార్గ విధానాన్ని సీపీఎస్ ఉద్యోగుల నెత్తిన పెడుతూ వెళ్ళారు. కాని ఈ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ జీపీఎస్ బిల్లును తాత్కాలికంగా నిలుపుదల చేయండి అని చంద్రబాబు నాయుడు చెప్పడంతో ఉద్యోగులు ఆశలు చిగురుస్తున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో ఉద్యోగులతో చర్చించి పరిష్కారం చూపుతారని చెప్పారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు



కలెక్టరేట్: సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్న ఉద్యోగులు

సెలవు రోజుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు

● డీఈవో ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

చీపురుపల్లి: సెలవు రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు తెరిచే యాజమాన్యాలపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన చీపురుపల్లి ఎంఆర్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంఈవో ఎం.బూసినాయుడు, ఎంఆర్‌సీ సిబ్బందితో మాట్లాడారు. సెలవు రోజుల్లో పాఠశాలలు తెరుస్తున్నదీ లేనిదీ చూడాలన్నారు.

ఉపాధి మేట్లపై విచారణ



పాలవలసలో పోలీసుల సమక్షంలో విచారణ చేస్తున్న దృశ్యం

గుర్ల: పాలవలస గ్రామంలో ఉపాధి హామీ పనులు చేయించే మేట్లపై మంగళవారం విచారణ చేపట్టారు. కొంతకాలంగా ఫీల్డ్ అసిస్టెంట్, మేట్ల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై వారం రోజుల కిందట తహసీల్దార్ విచారణ చేపట్టారు. అంతకు ముందు ఎంపీడీవో, ఏవో, సిబ్బంది విచారణ చేపట్టారు. తర్వాత ఎస్.కోట ఏపీడీ శారదాదేవి ఆధ్వర్యంలో మరోసారి విచారణ చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి గ్రామంలో యుద్ధ వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ తమకు వద్దంటూ కొందరు వాదించగా.. మరికొంతమంది పనికి హాజరు కాని వారికి మేట్లు మస్తర్లు వేస్తున్నారని ఆరోపించారు. దీంతో వివాదం పెద్దదయ్యింది. మొత్తం వ్యవహారాలపై అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షించి నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. ఇంతలో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విచారణలో ఏపీవో కామేశ్వరరావు, మండల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు షెడ్ల సౌకర్యం



మార్కెట్‌లో షెడ్ నిర్మాణాలకు పనులు చేపడుతున్న దృశ్యం

గజపతినగరం: స్థానిక కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారులకు షెడ్‌ల నిర్మాణాల దిశగా ఎట్టకేలకు అధికారులకు అడుగులు వేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారులు సర్వే చేపట్టడం తప్పితే చిరు వ్యా పారుల కలను నెరవేర్చలే కపోయారు. టీడీపీ అధికా రంలోకి వచ్చిన నెల రోజుల వ్యవధిలోనే అధికారు లు మంగళవారం కూరగాయల మార్కెట్‌లో షెడ్‌ల నిర్మాణం దిశగా చర్యలు చేపట్టారు. యంత్రాలతో తుప్పలను తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. నాబార్డు నిధుల నుంచి రూ.15లక్షలు, గజపతినగరం గ్రామ పంచాయితీ నుంచి రూ.5లక్షల వ్యయంతో షెడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఈఓ మంత్రి రమణ తెలిపారు. పంచాయతీ పరిధిలో 20 సెంట్లలో 40 మంది చిరు వ్యాపారుల కోసం షెడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో 40 ఏళ్ల నుంచి పోరాటాలు చేస్తున్న చిరు వ్యాపారుల కల నెరవేరే అవకాశం వచ్చిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు



వసతి గృహంలో రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్

బొండపల్లి: వసతి గృహాల్లో ఉండి విద్యనభ్యసిస్తున్న పిల్లల పట్ల పర్యవేక్షణ విషయంలో అలసత్వం వహిస్తే తీవ్ర చర్యలు తప్పవని తహసీల్దార్ నందిగాం హనుమంతురావు హెచ్చరించారు. దేవుపల్లి కస్తూరిబా, బీసీ బాలికల వసతి గృహం, బొండపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని మంగళ వారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగు దొడ్ల నుంచి మురుగుపోయే మార్గం లేక దుర్గంధం మధ్య విద్యార్థులు, ఉపాధ్యాయులు గడపాల్సి వస్తోందని విద్యార్థు లు మొర పెట్టుకున్నారు. అనంతరం బీసీ బాలికల వసతిగృహం, బొండపల్లి వసతి గృహాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రవి, దేవుపల్లి, బొండపల్లి వార్డెన్‌లు రెడ్డిపల్లి కృష్ణవేణి, గౌరీలక్ష్మి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయండి



నాగార్జునకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

చీపురుపల్లి: గ్రామీణ నీటి సరఫరా విభాగంలో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న తమకు న్యాయం చేయాలని పంప్ ఆపరేటర్లు, లైన్‌మేన్లు తదితర కార్మికులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు చీపురుపల్లిలోని నివాసంలో నాగార్జునను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్‌ఎస్‌ఆర్ ధరల ప్రకారం జిల్లాలో ఒక్కో కార్మికునికి రూ.18 వేల నుంచి రూ.21 వేలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, తమకు మాత్రం సంబంధిత కాంట్రాక్టరు నెలకు రూ.6వేలు చెల్లిస్తున్నారని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. నాగార్జునను కలిసిన వారిలో ఆ సంఘ ప్రతినిధులు రౌతు కనకరాజు, దిండి వెంకటరావు, కె.రామారావు, శ్రీరాములు, లక్ష్మణరావు, ఎస్.అప్పలనాయుడు, ఆర్.ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయాధికారి విజయ కళ్యాణి

నెల్లిమర్ల: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.విజయకల్యాణి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీతారామునిపేటలో మంగళవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను స్నేహ పూర్వక వాతావరణంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య, తహసీల్దార్ డి.ధర్మ రాజు, ఎంపీడీవో జి.రామారావు, ఏఎస్ఐ రమణమూర్తి, గ్రామ పెద్దలు, సచివాలయ కార్యదర్శి అనూష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ మారు రథయాత్ర

● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో మంగళవారం శ్రీజగన్నాథ స్వామి మారు రథయాత్రను ఘనంగా నిర్వహించారు. స్వామివారి భక్తసంఘం ప్రతినిధులు రథాన్ని మేళతాళాలతో ఊరేగించారు. అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో సుభద్ర-బలభద్రసమేత శ్రీ జగన్నాథస్వామికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఎమ్మెల్యే బేబీనాయన, మున్సిపల్ ఫ్లోర్ లీడరు గెంబలి శ్రీనివాసరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ● **జామి:** మండల కేంద్రమైన జామిలో జగన్నాథస్వామి మారు రథయాత్రను మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు.



బొబ్బిలి పట్టణంలో జగన్నాథ రథయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు



జామి మండల కేంద్రంలో..

గ్రామీణ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి

● గిరిజన గ్రామాల్లో ఎంపీ కలిశెట్టి పర్యటన

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. మండల పరిధిలోని గిరిజన గ్రామాల్లో మంగళవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో ఇటీవల మానవమృగం చేతిలో అత్యాచారానికి గురైన పసికందు కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి.. పురిపాకలో నిర్వహించడం శోచనీయమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం నిర్మించేందుకు కలెక్టర్‌తో మాట్లాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, టీడీపీ నాయకులు కరణం విజయభాస్కర రావు, కనిమెరక శంకరరావు, సర్పంచ్ సునీత, తాడ్డి శ్రీనివాసరావు, యెుగి నాయుడు, పల్లా చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బైకుపై గిరిజన గ్రామానికి..

మండల పర్యటనకు వచ్చిన ఎంపీ.. గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో కొండకెంగువ నుంచి బైకుపై అక్కడికి చేరుకున్నారు. రెండు గెడ్డలు దాటుకుని పిల్లలు పాఠశాలకు వెళుతున్న రోడ్డు పరిస్థితిని పరిశీలించారు. అక్కడ గిరిజన మహిళలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. జుమ్మువలస పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో, విద్యార్థులు రెండు గెడ్డలు దాటాల్సి వస్తోందని తెలిపారు. తాగునీటి సమస్య కూడా గ్రామంలో ఎక్కువగా ఉందన్నారు. దీనిపై పార్లమెంట్‌లో చర్చిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. తక్షణమే జీలికవలస రోడ్డుకు జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, హౌసింగ్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జుమ్ము వలస విద్యార్థులు ఇక నుంచి కొండకెంగువ పాఠశాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోను ఆదేశించారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్వాహకులు సీనియర్ మేనేజర్ అంబళ్ల రవికుమార్‌తో మాట్లాడి ఈ గ్రామానికి సిమెంట్ బుగ్గి వేయాలని కోరారు.



బైకుపై పర్యటిస్తున్న ఎంపీ కలిశెట్టి

చుక్కనీరు అందడం లేదు

అనంతరం ఏడొంపులగెడ్డ ఆనకట్టను ఎంపీ పరిశీలించారు. దీని ద్వారా సుమారు 2 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో చుక్కనీరు అందడం లేదని, కుడి, ఎడమ కాలువలు పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయాయని స్థానికులు తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఈ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కొండకెంగువలో ఉన్న దేవుడు బాబు ఆశ్రమాన్ని సందర్శించారు. మాజీ సర్పంచ్ సిరిపురపు శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

బ్లడ్ గ్రూప్‌పై గందరగోళం

మెంటాడ: రాబంద గ్రామానికి చెందిన లక్ష్మి అనే గర్భిణీకి రక్తపరీక్ష విషయంలో గజపతినగరం సీహెచ్‌సీ సిబ్బంది తీరు వివాదాస్పదమవుతోంది. గర్భిణి లక్ష్మి ఈ ఏడాది ఫిబ్రవరి 21న చల్లపేట పీహెచ్‌సీలో రక్తపరీక్ష చేయించుకోగా, బి.నెగిటివ్ అని నిర్ధారించి, రిపోర్ట్ ఇచ్చారు. ఇతర పరీక్షల నిమిత్తం అదేరోజు గజపతి నగరం సీహెచ్‌సీకి వెళ్లగా, అక్కడ రక్తపరీక్ష నిర్వహించి బి.పాజిటివ్ అని తేల్చారు. ఒకే రోజు రెండుచోట్ల రెండు రకాల బ్లడ్ రిపోర్టులతో యువతి, ఆమె కుటుంబ సభ్యులు గందరగోళానికి గురయ్యారు. మే 24న విజయనగరం ఘోషాసుపత్రిలో మళ్లీ రక్తపరీక్ష చేసిన అక్కడి సిబ్బంది లక్ష్మి బ్లడ్ గ్రూపు బి.నెగిటివ్‌గా రిపోర్టు ఇచ్చారు. దీంతో లక్ష్మి, కుటుంబ సభ్యులు మరోసారి అయోమయంలో పడ్డారు. చివరిగా జూన్ 12న విజయనగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కి వెళితే అక్కడ కూడా బి.నెగిటివ్ గ్రూపుగా నిర్ధారించారు. ఒక్క గజపతినగరం సీహెచ్‌సీలో మాత్రం బి.పాజిటివ్ రిపోర్టు ఇవ్వడంతో వీటిలో ఏది కరెక్టో తేల్చుకోలేక సతమతమవుతున్నారు. గతంలో కూడా గజపతినగరం సీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ల తీరు సంచలనం రేకెత్తించింది. ఒక యువతి రుతుస్రావం సమస్యతో అక్కడికి వెళ్తే ల్యాబ్ సిబ్బంది ఆమె గర్భవతి అని తేల్చేస్తూ నివేదిక ఇవ్వడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. తాజాగా రాబంద యువతి బ్లడ్ గ్రూపు విషయంలో మరోసారి వార్తల్లోకి ఎక్కినట్టయింది. దీనిపై డీఎంహెచ్‌వో భాస్కరరావు వద్ద ప్రస్తావించగా, ఆయన విస్మయం వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలిస్తానని తెలిపారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

గరివిడి: రైతుల శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారని టీడీపీ మండల నాయకుడు, మాజీ ఎంపీపీ పైల బలరాం అన్నారు. గరివిడి ప్రెస్ క్లబ్‌లో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం వ్యవసాయానికి అరకొరగా విద్యుత్ సరఫరా చేసేదన్నారు. కానీ చంద్రబాబు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు కార్యదర్శి దిండి రమేష్, ఎం.దుగ్గివలస టీడీపీ అధ్యక్షుడు బోర భాస్కరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాము కాటు

భోగాపురం: సుందరపేట గ్రామ సమీపంలో ఉపాధి పని చేస్తున్న అప్పన్నపేట గ్రామానికి చెందిన ఎర్ర సూరి మంగళవారం పాముకాటుకు గురయ్యాడు. బంగారమ్మ చెరువు పొలం కాలువలో ఉపాధి పని చేస్తుండగా సూరిని పాము కరిచింది. అక్కడే ఉన్న కూలీలు, క్షేత్ర సహాయకుడు త్రినాథ్ క్షణాల్లో స్పందించి సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అయితే సూరి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం డిశ్చార్జ్ చేస్తారని వైద్యులు తెలిపినట్టు త్రినాథ్ చెప్పారు.

ఆడపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

గుర్ల: ఆడపిల్లల విషయంలో ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో వెంకటరావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆడపిల్లల సంరక్షణ, వారిపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు తదితర వాటిపై అధికారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఐసీడీఎస్ పీవో ఆరుద్ర శకుంతల, మండల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహాలు త్వరితగతిన నిర్మించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రకళ

భోగాపురం: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో జి.చంద్రకళ లబ్ధిదారులకు సూచించారు. పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో మంగళవారం పర్యటించి ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఎం.కృష్ణప్రసాద్, టి.అరుణ కుమారి, కె.స్వర్ణరజిత, తదితరులు పాల్గొన్నారు.

గెజిట్ నిలుపుదలపై హర్షం

గరుగుబిల్లి: జీపీఎస్ జీవో రాజపత్రం తాత్కాలికంగా నిలిపివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయంపై ఏపీ టీచర్స్ ఫెడరేషన్ మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మర్రాపు మహేష్, ఎస్.బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వీరు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం జీపీఎస్‌ను అమల్లోకి తీసుకొచ్చిందని, అయితే దీనిని అమలు చేస్తూ జూన్ 12న గెజిట్ ఇవ్వడంపై ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కొంత మేర ఆందోళన తెలిపాయన్నారు. ఈక్రమంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జీపీఎస్ గెజిట్ నిలుపుదలకు చర్యలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన పలు హామీలను నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. **సాలూరు రూరల్:** జీపీఎస్ జీవో గెజిట్‌ను నిలిపివేయడం ఆనందాయకమని ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్, ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ అన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున

చీపురుపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఇక ఈ ప్రాంతం పురోగతిలో పరుగులు తీయడం ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గాడి తప్పిన పాలనను చంద్రబాబు సరి చేస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నారని నాగార్జున తెలిపారు. తోటపల్లి నీటిని గడిగెడ్డకు తరలించి, విజయనగరానికి తాగు నీరందించేదుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

పక్షపాత ధోరణిని సహించం

చీపురుపల్లి: రేషన్ డీలర్ల పట్ల పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తే సహించబోమని స్థానిక వైసీపీ నాయకులు స్పష్టం చేశారు. పత్తికాయవలస డీలర్ కోంద్రోతు ఈశ్వరరావు, జి.ములగాం రేషన్ డీలర్ గడే సత్యవతిపై చర్యలను ఖండిస్తూ మంగళవారం స్థానిక వైసీపీ నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు.. తహసీల్దార్ ఎన్.ప్రసాదరావును కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్టాకు విడుదల చేసే సమయంలో మండల స్థాయి స్టాక్ పాయింట్ వద్ద ఈపోస్ యంత్రం పని చేయలేదన్నారు. యంత్రాలు పని చేయకపోతే డీలర్లను అనుమానించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే దీనిపై దర్యాప్తు జరపాలని, తప్పు చేస్తే డీలర్లపై చర్యలు తీసుకోవాలని, లేదా సీఎస్‌డీటీపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

రామతీర్థం తలుపులకు ఇత్తడి రేకుల వితరణ



ద్వారాలు, తలుపులకు ఇత్తడి రేకులు అలంకరిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: రామతీర్థం దేవస్థానం ఆస్థాన మండపం దక్షిణ ద్వారానికి, తలుపులకు అలంకరణ కోసం ఇద్దరు దాతలు ఇత్తడి రేకులు వితరణ చేశారు. సాలూరుకు చెందిన కొలకోటి శంకరరావు, సునీత దంపతులు, రామతీర్థం గ్రామానికి చెందిన సుదర్శనం విజయ్‌కుమార్, రామలక్ష్మి దంపతులు అందజేసిన ఇత్తడి రేకులతో ద్వారాన్ని, తలుపులను మంగళవారం అందంగా అలంకరించారు. వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావుతో పాటు అర్చకులు పాల్గొన్నారు.

ప్రతి గురువారం గ్రామ సందర్శన

గుర్ల: మండలంలో నెలలో ఒక గురువారం గ్రామ సందర్శన ఉంటుందని ఎంపీడీవో వెంకటరావు చెప్పారు. ముందుగా చింతలపేట గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. 18న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో అధికారులు ఉంటారని, వారికి సూచనలు, సలహాలతో పాటు సమస్యలు తెలియజేయాలని చెప్పారు.

ఇసుక అక్రమ నిల్వలు

భోగాపురం: దల్లిపేట సమీపంలో రాళ్లపాలెం వెళ్లే రహదారిలో ఇసుక అక్రమంగా నిల్వ చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఇసుక తీసుకొచ్చి అక్కడ నిర్మానుష్యమైన ప్రాంతంలో నిల్వ చేసి అక్కడి నుంచి ట్రాక్టర్లతో అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. ఇసుక కల్తీ చేస్తున్నట్లు సమాచారం. ఇసుక అక్రమంగా నిల్వ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

క్లుప్తంగా..

ఎమ్మెల్యే కళాను కలిసిన సీఎన్‌ఎఫ్ అధికారులు



నేచురల్ ఫార్మింగ్ వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేస్తున్న అధికారులు

చీపురుపల్లి: చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్) అధికారులు మంగళవారం రాజాంలో కలిశారు. కమ్యూనిటీ ఫార్మింగ్‌లో తమ శాఖ అనుసరిస్తున్న విధానాలను ఆయనకు వివరించారు. నియోజకవర్గంలోని 22 గ్రామాల్లో 5 వేల ఎకరాల్లో నేచురల్ ఫార్మింగ్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు.

లోకేశ్‌ను కలిసిన వనజాక్షి



లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వనజాక్షి, రవిశేఖర్

నెల్లిమర్ల: రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ విజయనగరం జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ పరిస్థితులపై చర్చించారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

నేడు ఇఫ్టూ నేత సంతాప సభ

నెల్లిమర్ల: ఇఫ్టూ కార్మిక సంఘం నాయకుడు ఉరిటి ఉమామహేశ్వరావు సంతాప సభ ఈనెల 17న బుధవారం ఉదయం పది గంటలకు స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఎం.గోపాలం, గీత తదితరులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

కుష్ఠు వ్యాధి సర్వేపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న దృశ్యం

దత్తిరాజేరు: కోరపుకొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పి.స్రవంతి ఆధ్వర్యంలో లెప్రసీ సర్వేపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈనెల 18 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు లెప్రసీ సర్వే ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డివి.గిరిబాబు, ఎంపీహెచ్‌వో బి.మురళి, ఆర్.శ్రీనివాసరావు, కె.రత్నమ్మ, సీహెచ్‌వోలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.